# సాక్షి తిరుపతి

సోమవారం। 13। జనవరి। 2025






## అలసత్వం వహిస్తే చర్యలు

ఆర్టీసీ డ్రైవర్లు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీపీటీఓ నరసింహాలు హెచ్చరించారు. - 10లో



## ఏటి పండుగకు సర్వం సిద్ధం

నాయుడుపేటలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఏటి పండుగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 10లో



## ముఖ్యమంత్రికి సాదర స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆదివారం రేణిగుంట ఎయిర్‌పోర్టులో ప్రజాప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. - 10లో

## న్యూస్‌రీల్

### ఆదర్శనీయులు వివేకానంద



విజేతలకు బహుమతులు అందిస్తున్న సెట్విన్ సీఈఓ

**తిరుపతి కల్చరల్ :** భారతీయ ఆధ్యాత్మిక విలువలను విశ్వవ్యాప్తం చేసిన ఆదర్శనీయులు స్వామి వివేకానంద అని, ఆయనను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సెట్విన్ సీఈఓ కె.మోహన్ కోరారు. ఆదివారం వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎస్వీ మెడికల్ కళాశాల సర్కిల్‌లోని విగ్రహం వద్ద వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలైన ఎమరాల్డ్స్, ఏటీఎస్ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు మోషిత, మైత్రి, యశ్వని, అక్షత, కుసుమాంజలి, యామిని, కార్తీక్, యమునలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం శ్రీరామకృష్ణ మఠం ప్రతినిధి విశ్వరాజనందస్వామి మాట్లాడుతూ నేటి యువతే దేశాభివృద్ధికి పునాదులని, నిద్రావస్థ నుంచి మేల్కొని ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలన్నారు. స్వామి వివేకానంద సూచించిన మార్గంలో పయనిస్తూ ఉత్తములుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మఠం ప్రతినిధులు డాక్టర్ మురళీకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి సీవీఎస్‌ఓగా మణికంఠ



**తిరుమల :** టీటీడీ ఇన్‌చార్జి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం తిరుమలలో మణికంఠ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీవీఎస్‌ఓగా విధులు నిర్వర్తించిన శ్రీధర్ ఇటీవల తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన కారణంగా బదిలీ కావడం విదితమే. ఈ క్రమంలో ఇన్‌చార్జి సీవీఎస్‌ఓ మాట్లాడుతూ భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు.

### ఇంగ్లిష్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు

**తిరుపతి సిటీ :** తిరుపతి జూపార్క్ రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో టీజీటీ గెస్ట్ ఇంగ్లిష్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.రేష్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు ఏదైనా డిగ్రీతో పాటు బీఈడీ ఇంగ్లిషు మెథడాలజీ పూర్తి చేసి ఉండాలని వెల్లడించారు అభ్యర్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9000783185 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

---

| గ్రామం: కొండూరుపాళెం | మండలం: వాకాడు | జిల్లా : తిరుపతి | కుటుంబాలు : 302 | జనాభా : 1,250 | వృత్తి : చేపల వేట |
|---|---|---|---|---|---|




# పస్తుల పండుగ

మధ్యాహ్నం 12 గంటల సమయం. గ్రామంలో ఎవరూ పనులకు వెళ్లిన దాఖలాలు కనిపించలేదు. పెద్ద పండుగ హడావుడి జాడే లేదు. పల్లెవాసులందరూ దిగాలుగా ఓ చోట కూలబడి ఉన్నారు. పలకరిస్తే 'పని లేదు.. పాటా లేదు.. ఏం చేయమంటరు సామీ' అంటూ నిట్టూర్చారు. గ్రామస్తుల గోడు వింటే గుండె బరువెక్కిపోతుంది. ఇంతకూ అది ఏ ఊరు.. ఏంటా కథ అంటారా..? రండి కొండూరుపాళెం వెళదాం. అక్కడి మత్స్యకారుల దీనావస్థను చూద్దాం.

ఇటు తిరుపతికి 155 కిలోమీటర్లు.. అటు నెల్లూరుకి 90 కిలోమీటర్ల దూరంలోని వాకాడు మండలంలో ఉన్న కొండూరుపాళెం అది. గ్రామంలో దాదాపు అందరూ మత్స్యకారులే. రెక్కాడితే కానీ, డొక్కాడని పరిస్థితి. నిత్యం సముద్రంలోకి వెళ్లి వేట సాగిస్తేనే కడుపు నిండుతుంది. అలాంటిది రెండు నెలలుగా వారికి పనిలేదు. తుపాను ప్రభావంతో సముద్రంలోకి వెళ్లొద్దని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ సాగరంలోకి దిగితే చర్యలు తప్పవని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. ఫలితంగా ఇటు చేపల వేట లేక.. అటు పూట గడవక గంగపుత్రుల జీవనం దయనీయంగా మారింది. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు కనీస అవకాశం కూడా లేకుండా పోయింది.

### సంక్రాంతి లేని కొండూరుపాళెం

- రెండు నెలలుగా నిలిచిన వేట
- కనీస సాయం అందించని ప్రభుత్వం
- పూట గడవక అలమటిస్తున్న మత్స్యకారులు
- దయనీయ స్థితిలో 302 కుటుంబాలు

**సాక్షి ప్రతినిధి, తిరుపతి/వాకాడు :** జిల్లాలో సుమారు 75 కిలోమీటర్లు పొడవున సముద్ర తీరం విస్తరించి ఉంది. వాకాడు, కోట, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట మండలాల్లోని 42 మత్స్యకార గ్రామాల్లో 70 వేల మంది ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం సముద్రంపై వేట చేసే మత్స్యకారులు 12 వేల మంది ఉన్నారు. వారికి 1,022 బోట్లు ఉన్నాయి. 31 ఫిష్ లాండ్స్ ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకార భరోసా కింద రూ.10వేలు ఇచ్చేవారు. రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. రూ.9లకు వరకు డీజిల్‌పై సబ్సిడీ అందించేవారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్ పంపిణీ చేసేవారు. వేట నిషేధ సమయంలో ఏటా క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా నగదును చెల్లించేవారు. ఈ విధంగా పలు సంక్షేమ పథకాలతో గత ప్రభుత్వం చేయూతనందించేది. నాడు–నేడు కింద మత్స్యకార గ్రామాల్లో పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. ఆరోగ్య సురక్ష కింద వైద్యులే ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలందించేవారు. ఈ క్రమంలో మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది.

### పూట గడిస్తే అదే చాలు



నా పేరు శీనయ్య. భార్య, ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. నేను చేపల వేటకు వెళితేనే పూట గడిచేది. నేను వేటకు వెళ్లొస్తే ఇంట్లో వాళ్లు వాటిని అమ్మి డబ్బులు తెచ్చేవారు. దాంతో కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. ఇప్పుడు రెండు నెలలుగా చేపలవేట లేదు. పూట గడవటం కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి పండగ చేసుకునే స్థితిలో మేము లేము సారు. గత ఏడాది అయితే మాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.76వేలు ఇచ్చింది. ఇంకా బియ్యం, ఇతరత్రా సాయం అందించింది. ఆస్పత్రికి కూడా పొయ్యే పనిలేకుండా డాక్టర్లో ఊర్లోకి వచ్చి మందులు ఇచ్చి వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏడు నెలలుగా చూస్తున్నాం.. ఒక్క రూపాయి కూడా వచ్చింది లేదు. కనీసం చేపల వేటకు వెళ్దాం అన్నా.. తుపాను అంటూ ఆపేశారు. ఇన్నాళ్లు ఆపేస్తే మేమెట్టా బతకాలి. ప్రభుత్వం అయినా సాయం చేయాలి కదా? అదీ లేదు. పూట గడిస్తే అదే పండగలా ఉంది.

### కూటమి పాలనలో కష్టాలే!



దిగాలు కూర్చున్న మహిళలు



తీరంలో నిలిచిన బోట్లు

కూటమి ప్రభుత్వ ప్రభుత్వంలో మత్స్యకారుల కష్టాలు వర్ణణాతీతం. వేట విరామ సమయంలో కనీస సాయం అందించలేదు. ఎన్నికల సమయంలో రూ.20వేలు చెల్లిస్తామని ఊదరగొట్టిన నేతలు తీరా పీఠం ఎక్కిన తర్వాత బడుగు బతుకులను నిలువునా ముంచేశారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన మత్స్యకార భరోసాను సైతం ఎగ్గొట్టేశారు. ఇదే ప్రకృతి వైపరీత్యాలు చుట్టుముట్టడంతో గంగపుత్రుల జీవనం గందరగోళంగా మారింది. ఓ వైపు వేటకు వెళ్లొద్దని అధికారుల హుంకరింపులు, మరో వైపు ఇంట్లో తిండి లేక ఆకలి కేకలు. ఈ క్రమంలో వారి బతుకులు అల్లకల్లోలంగా మారిపోయాయి. రెండు నెలలుగా వేటకు దూరంగా ఉండడం వారి జీవితాలను కష్టాల సంద్రంలోకి నెట్టేసింది. అటు సంక్షేమ పథకాలు అందకపోవడం, ఇటు వేట లేకపోవడంతో పూట గడవక విలవిల్లాడే దుస్థితి దాపురించింది.

### ఇలా అయితే ఎలా బతకాలి?



నా పేరు అంకయ్య. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నేను వేటకు వెళ్లొస్తే గాని మాకు బువ్వ రాదు. అటువంటిది రెండు నెలలుగా వేటకు వెళ్లనివ్వలేదు. ప్రభుత్వం కూడా సాయం చేయలేదు. ఇలా అయితే పండగ ఎలా చేసుకునేది? బతకడమే కష్టంగా ఉంది సారు? గత ఏడాదైతే బాగా జరిగింది. పండగను జరుపుకున్నాం. అప్పటి ప్రభుత్వం నుంచి మాకు రూ.96వేలు వచ్చింది. ఈ ఏడు చేపల వేట లేదు, ప్రభుత్వ సాయమూ లేదు. ఇక పండగ ఎలా జరుపుకోవాలి సారూ.

### పోయినేడు గొప్పగా జరుపుకున్నాం



నాపేరు నానాకిలే. భర్త లేదు. ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశా. అల్లుళ్లు, కూతుర్లు నాతోనే ఉంటారు. చేపల వేటకు వెళితే కానీ ముద్ద రాదు. రెండు నెలలుగా చేపల వేట లేదు. తుపాను వస్తుంది వెళ్లొద్దని సారు వాళ్లు చెప్పారు. బువ్వకి కూడా ఇబ్బందిగా ఉంది. పోయినేడు ఇదే పెద్ద పండుగను ఎంతో గొప్పగా జరుపుకున్నాం. ఆ ఏడు ప్రభుత్వం నుంచి మా కుటుంబానికి రూ.1.21 లక్షలు వచ్చాయి. కొత్త బట్టలు తెచ్చుకున్నాం. ఇంట్లో నిండుగా సరుకులు ఉండేవి. వేట విరామ సమయంలో ప్రభుత్వం వెంటనే డబ్బులు, బియ్యం ఇచ్చేది. ఈ ఏడు సర్కారు నుంచి ఎటువంటి డబ్బులు రాలేదు. బియ్యం కూడా ఇవ్వలేదు. ఇంట్లో ఆరుగురు ఉన్నాం. పూట గడవటమే కష్టంగా ఉంది. అప్పు చేసి ఓ పూట తిని మరో పూట పస్తు ఉంటున్నాం.

### అప్పట్లో అన్నీ అందేవి



నా పేరు కోగిలి జాలమ్మ. నాకు ఇద్దరు ఆడబిడ్డలు. నా మొగుడు వేటకు వెళితేగాని పూటగడవదు. రెండు నెలలుగా వేట లేదు. ఏం చేయాలి? ఇదిగో ఇలా కూర్చొని ఒకరి కష్టం ఒకరు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నాం. అప్పట్లో మాకు అన్నీ అందేవి. నాడు– నేడు అంట, దాని ద్వారా ఇదిగో బడి బాగుపడింది. నా బిడ్డలను చదువుకు పంపుతున్నా. నిరుడు ఈయాలికంతా రూ.81వేలు వచ్చింది. ఆ డబ్బులతో పండక్కి గుడ్డలు, వస్తువులు కొనుక్కున్నాం. సచివాలయం వాళ్లు వచ్చి వెళ్లేవారు. మాకు ఏం కావాలో అడిగేవారు. మాకు తెలవకపోయినా వాళ్లే చెప్పేవారు. పేపర్లు అన్నీ రాసిచ్చి డబ్బులు వచ్చేలా చేసేవారు. ఈ ఏడు ఒక్క రూపాయి రాలేదు. ఎలా పండగ జరుపుకోవాలి. పూటగడిస్తే చాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం సామీ.

### సందడే లేదు



నా పేరు రామయ్య. మా ఇంట్లో ఆరుగురు ఉంటాం. కొడుకులు, కోడళ్లు ఉన్నారు. చేపల వేటే మాకు జీవనాధారం. నేను, నా కొడుకు చేపల వేటకు వెళ్లేవాళ్లం. అటువంటిది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపల డిపార్ట్‌మెంట్‌లో నాకు చిన్న ఉద్యోగం వచ్చింది. దీంతో వేటకు వెళ్లకపోయినా ఆ ఉద్యోగంతో అంతో ఇంతో కుటుంబం గడిచిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో మా కుటుంబానికి రూ.78వేల వరకు వచ్చాయి. ప్రస్తుతం అయితే ఎటువంటి పథకాలు అందలేదు. దీనికితోడు వేట లేకపోవడంతో ఊర్లో ప్రతి ఒక్కరూ ఇబ్బందుల్లో ఉన్నారు. పూట గడిచేందుకే అవస్థలు పడుతున్నారు. దీంతో మా ఊర్లో సంక్రాంతి పండుగ సందడి లేదు.

---



భూదేవి కాంప్లెక్స్ వద్ద ఖాళీగా క్యూ

భక్తజనం..

# వీడని భయం!

తిరుమల శ్రీవారి కనులారా వీక్షించేందుకు భక్తులు ఎదురుచూస్తూ ఉంటారు. ప్రధానంగా వైకుంఠ ద్వార దర్శన భాగ్యం కోసం ఏడాది నుంచి ప్రయత్నిస్తుంటారు. అయితే తిరుపతిలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన భక్తులను ఇప్పటికీ కలవరపెడుతోంది. టీటీడీ చరిత్రలోనే ఇలాంటి దుర్ఘటన ఇప్పటి వరకు చోటు చేసుకోలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు టీటీడీ బోర్డు, అధికారుల అవగాహన, బాధ్యత రాహిత్యం కారణంగా ఆరుగురు భక్తులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ శ్రీవారి భక్తులను ఇదో పీడకలలా వెంటాడుతోంది. తొక్కిసలాట దృశ్యాలను టీవీలు, సామాజిక మాధ్యమాల్లో చూసిన భక్తులు నేటికీ భయాందోళనలోనే ఉన్నారు.

- వైకుంఠ ద్వార దర్శనంపై భక్తుల నిరాసక్తత
- 15 గంటలపాటు సాగిన 46వేల టోకెన్ల పంపిణీ
- జనం లేక బోసిపోయిన క్యూలు

**తిరుపతి టాస్క్‌ఫోర్స్ :** అత్యంత పవిత్రంగా భావించే వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. 13వ తేదీ సోమవారానికి సంబంధించి రెండు రోజుల ముందు శనివారం రాత్రి 9 గంటలకు టోకెన్లను కేటాయించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. అదే రోజుకు సంబంధించి 46 వేల టోకెన్లను అందుబాటులో ఉంచింది. శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో మాత్రమే టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. టోకెన్లు అందుబాటులో ఉన్నప్పటికీ భక్తుల రద్దీ మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. శనివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన టోకెన్ల జారీ ఆదివారం మధ్యాహ్నం సుమారు 15 గంటల పాటు కొనసాగింది. ఇదే సమయంలో క్యూలు జనం లేక బోసిపోయాయి.

**టోకెన్ ఉంటేనే దర్శనం**

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ ఉంటేనే తిరుమల శ్రీవారి దర్శానానికి అనుమతిస్తామని టీటీడీ స్పష్టం చేయడంతో నడక మార్గం భక్తులుపూర్తిగా తగ్గిపోయారు. అలిపిరి మెట్ల మార్గంలో రెండు చోట్ల టోకెన్ పరిశీలించి భక్తులను అనుమతిస్తున్నారు. తొక్కిసలాటతో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గిపోయింది. అయినా అధికారులు మాత్రం తొక్కిసలాట ముందు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండడంతో నడక మార్గం భక్తులకు కూడా తగ్గుముఖం పట్టారు. రద్దీ లేకున్నా తప్పనిసరి టోకెన్ అని తేల్చి చెబుతుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ లేని భక్తులను కూడా ఎప్పటిలాగే అనుమతించి క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శనానికి పంపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### 14వ తేదీ టోకెన్ల విడుదల

వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు ఒకరోజు ముందు జారీ చేసేలా టీటీడీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 13వ తేదీకి సంబంధించిన టికెట్లను 11వ తేదీ రాత్రి 9 గంటల నుంచి పంపిణీ మొదలుపెట్టారు. 14వ తేదీకి సంబంధించి 12వ తేదీ రాత్రి నుంచి ఇవ్వాల్సి ఉండగా రద్దీ లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచే టికెట్లు జారీ చేశారు.

### గోవిందా.. ఇంత చిన్నచూపా?

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** తిరుపతి తొక్కిసలాట ఘటనలో మరణించిన బాధిత కుటుంబాల పట్ల ఇటు ప్రభుత్వం, అటు టీటీడీ వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే టీటీడీనే చెక్కులు పంపిణీ చేయనున్నట్లు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం రాత్రి వెల్లడించారు. బోర్డు సభ్యులతో కమిటీని నియమించి మృతుల కుటుంబాలను పరామర్శించి చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. దీనిపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలను సీఎం, టీటీడీ చైర్మన్ నేరుగా వెళ్లి పరామర్శించి చెక్కులు ఇచ్చేందుకు మనస్సు రాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

**పోలీసుల దురుసు ప్రవర్తన**

శ్రీనివాసం వద్ద శనివారం రాత్రి 13వ తేదీకి సంబంధించిన టోకెన్లను తీసుకునేందుకు భక్తులు వచ్చారు. రద్దీ లేకపోయినప్పటికీ పోలీసులు, టీటీడీ సిబ్బంది దూకుడుగా వ్యవహరించారు. భక్తులతో వాగ్వాదానికి దిగి దురుసుగా ప్రవర్తించారు. దుర్భాషలాడడంతో భక్తులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం వస్తే ఇంత అమర్యాదగా వ్యవహరిస్తారా అంటూ ఆవేదన చెందారు. మహిళలు, చిన్నపిల్లలతో సైతం పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అమానుషంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఘటనను వీడియో తీస్తున్న భక్తులపై కూడా పోలీసులు దౌర్జన్యానికి దిగారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### తలచుకుంటేనే భయమేస్తుంది



తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకన్ల జారీ సమయంలో జరిగిన ఘటన తలచుకుంటేనే భయం వేస్తోంది. ఆ రోజు తిరుపతికి టోకెన్ల కోసం వచ్చాం. విషయం తెలిసి భయంతో ఊరికి వెళ్లిపోయాం. రష్ తగ్గింది అని సమాచారం అందగానే ఆదివారం మళ్లీ తిరుపతికి వచ్చి టోకెన్లు తీసుకున్నాం. క్యూలో ఇంకా భద్రత పెంచాల్సి అవసరముంది.

– త్యాగరాజన్, భక్తుడు, తిరుత్తణి

### జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం క్యూలు చాలా ఫ్రీగా ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం భక్తులు ఇప్పుడు టోకెన్ల కోసం పెద్దగా రావడంలేదు, అందరూ భయపడిపోయారు. టీటీడీ అధికారులు, పోలీసులు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశవాప్తంగా తొక్కిసలాటపై చర్చించుకుంటున్నారు. శ్రీవారి దర్శనం విషయంలో సామాన్య భక్తులకు పెద్ద పీట వేయాలి.

– మహాలక్ష్మి, భక్తురాలు, కోలార్

### రోదన వర్ణనాతీతం



క్యూలో సరైన సదుపాయాలు లేకుండా భద్రతపై దృష్టి సారించకపోవడంతోనే ఇలాంటి ఘటన జరిగింది. ఎంత డబ్బులు ఇచ్చినా పోయిన మనిషిని తెచ్చివ్వలేరు. ఆ బాధను ఆ కుటుంబం జీవితాంతం అనుభవించాల్సిందే. తల్లికి దూరమైన బిడ్డ, భార్యకు దూరమైన భర్త రోదన వర్ణనాతీతం. వారికి కలిగిన నష్టం ఏవరూ తీర్చలేనిది. నాటి ఘటనను చూసినవారు చెబుతుంటేనే ఒళ్లు జలదరిస్తోంది.

–ప్రమీలమ్మ, భక్తురాలు, గుంటూరు

# వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న నేతలు

**తిరుపతి మంగళం :** వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో పదవులు పొందిన నేతలు ఆదివారం పద్మావతీపురంలోని నివాసంలో కరుణాకరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. నేతలు మాట్లాడుతూ భూమన అండదండలతోనే ఉన్నత పదవులు లభించాయని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పకడ్బందీగా పార్టీ కోసం కృషి చేస్తామని తెలిపారు. భూమన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుబొమ్మగుంట రవి, ప్రధాన కార్యదర్శి వెలకచర్ల గోపాల్‌రెడ్డి, కోశాధికారి తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు కరాటే శీను, బత్తిన బాబు, క్రియాశీలక కార్యదర్శులు దాసనం ప్రసాదరావు, ఏ.కోటి, అధికార ప్రతినిధులు పసుపులేటి సురేష్ రాయల్, యాచం వాసుయాదవ్‌తోపాటు సీనియర్ నేత దుద్దేల బాబు పాల్గొన్నారు.

### భోగి మంటలు



జిల్లావ్యాప్తంగా భోగి సంబరాలను జనం ప్రారంభించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రజలు ఇళ్ల ముందు భోగి మంటలకు శ్రీకారం చుట్టారు. చలి కాచుకుంటూ హాయిగా గడిపారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ పర్యాయం వేడుకల సందడి తగ్గింది. – తిరుపతి కల్చరల్

## క్లుప్తంగా

### ఉత్తమ సర్వీస్ లక్ష్యంగా ఎస్వీ మోటార్స్ సేవలు


శ్రీవేంకటేశ్వర మోటార్స్ అధినేత లోకనాథరెడ్డి

**తిరుపతి కల్చరల్:** వినియోగదారులకు ఉత్తమ సర్వీస్ అందించడమే లక్ష్యంగా శ్రీవేంకటేశ్వర మోటార్స్ ఎస్ఎంఎల్ ఐఎస్‌యూజెడ్‌యూ లిమిటెడ్ నిరంతరం కృషి చేస్తుందని ఎస్వీ మోటార్స్ అధినేత పి.లోకనాథరెడ్డి తెలిపారు. 2024 నుంచి తమ సంస్థ విజయవంతంగా 20 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో కస్టమర్ల మద్దతు మరువలేనిదన్నారు. భవిషత్‌లో కూడా నిబద్ధతతో కూడిన డోర్ స్టెప్ సర్వీస్ ద్వారా మరింత దగ్గరగా ఉండేందుకు కృషి చేస్తామన్నారు. కస్టమర్ల సహకారం మరింత అందిస్తూ తమ మెరుగైన సేవలను అందుకోవాలని కోరారు. కస్టమర్లందరూ సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

### నేడు గ్రీవెన్స్ రద్దు

**తిరుపతి అర్బన్ :** తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. భోగి పండుగ నేపథ్యంలో రద్దు చేసినట్లు చెప్పారు. ఈ సమాచారాన్ని జిల్లా వాసులు గమనించాలని కోరారు.

### సీఎం, డిప్యూటీ సీఎంలకు అవమానం

– డాకు మహరాజ్ ప్రీమియర్ షోలో ఘటన


చంద్రబాబు, పవన్ చిత్రాలతో ఉన్న కరపత్రాలను చెప్పులతో తొక్కుతున్న ప్రేక్షకులు

**నాయుడుపేటటౌన్ :** నాయుడుపేటలో నందమూరి బాలకృష్ణ సినిమా డాకు మహరాజ్ చిత్రం ప్రీమియర్ షోను పట్టణంలోని ఎస్వీటీ థియేటర్లో ఆదివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు కూటమి నేతలు ఉన్న కరపత్రాలను అభిమానులు చించి థియేటర్‌లో ఎగుర వేశారు. కూటమి నేతల ఫొటోలను ముక్కలు ముక్కలుగా చేసి చెప్పులతో తొక్కుతూ కేరింతలు కొట్టారు. థియేటర్లో ఈ దృశ్యాలను చూసిన టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శివార్పణం!

**శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భద్రతా కౌంటర్లలో ఇష్టారాజ్యం**


- నిర్ణయించిన దానికంటే అధిక మొత్తంలో వసూలు
- రోజుకు రూ.లక్ష వరకు దోపిడీ
- లబోదిబోమంటున్న భక్తులు




**శ్రీకాళహస్తి:** ముక్కంటి దర్శనానికి వచ్చే భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. తమ వెంట తెచ్చుకునే సెల్‌ఫోన్, బ్యాగు, కెమెరా, పాదరక్షలు తదితర వాటిని భద్రపరుచుకోవాలంటే అధిక మొత్తంలో చెల్లించాల్సిన వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు సెల్‌ఫోన్లు, కెమెరాలు, బ్యాగులు, చెప్పులు భద్రపరుచుకునేందుకు ఆలయ నాలుగు ద్వారాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేశారు. వాటిని భద్రపరిచేందుకు ఎంత వసూలు చేయాలనే విషయం సంబంధిత టెండరుదారునికి అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయినా ఆయా కౌంటర్లలో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే ఇక్కడింతే... ఇష్టముంటే పెట్టుకోండి.. లేకుంటే బయటకు వెళ్లడంటూ.. కౌంటర్ నిర్వాహకులు విసురుకుంటున్నారని పలువురు భక్తులు వాపోతున్నారు. ఏం చేయాలో తెలియక వారు అడిగినంత డబ్బులు చెల్లించి భక్తులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

**టెండ'రింగ్'**

ముక్కంటి ఆలయ భద్రతా దృష్ట్యా ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, కెమెరాలు ఆలయంలోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధాన మార్గాల్లో కౌంటర్ కేంద్రాలు ఏర్పాటు చేసి సంబంధిత వస్తువులను స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.కోటికిపైగా కాంట్రాక్టర్ దక్కించుకుని వస్తువులను నిర్ణీత ధరలకే భద్రపరిచేవారు. అయితే రెండు నెలల క్రితం కూటమి నేతలు కుమ్మక్కై మూడు టెండర్లు వేశారు. ఇందులో ముగ్గురు కాంట్రాక్టర్లు కూటమి నేతలే కావడంతో గతంలో కంటే రూ.పది వేలు పెంచి టెండరు వేయడంతో.. అధికారులు దాన్ని ఖరారు చేశారు. అయిగే గతంలోకంటే ఇప్పుడు భక్తుల సంఖ్య పెరగడంతో కొంటర్లకు భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ కూటమి నేతలు టెండ'రింగ్'గా ఏర్పడి కౌంటర్లను దక్కించుకున్నారు. అయితే ఇందులో పూర్తి మొత్తం చెల్లించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదీగాక ఆలయ అధికారులు నిర్ణయించిన ధరలకంటే అధిక మొత్తం వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.



గతంలో ధరలతోకూడిన బిల్లు



ప్రస్తుతం ఎలాంటి ధరలు లేని బిల్లు

**'లక్ష'ణంగా దోపిడీ**

ఆయా కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కు రూ.10 నుంచి రూ.15 వసూలు చేస్తున్నట్టు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇక కెమెరా, బ్యాగులకు వారికి ఇష్టమొచ్చినట్లు వసూలు చేస్తున్నట్టు సమాచారం. వారు ఇచ్చే రసీదులపై కూడా ఏ విధమైన వివరాలు ఉండడం లేదని చెబుతున్నారు. గతంలో రసీదు మీద వసూలు చేసే మొత్తం వివరాలు ముద్రించేవారు. అయితే ఇపుడు అనధికారికంగా, ఇష్టారాజ్యంగా వసూలు చేస్తూ భక్తులను బెంబేలెత్తిస్తున్నారు. ఆలయానికి సుమారుగా రోజుకు 30 వేల మంది భక్తులు వస్తే అందులో సగం మందికి పైగా సెల్‌ఫోన్ ఉంటుంది. ఈ లెక్కన రోజుకు రూ.50 వేల నుంచి రూ.75వేల వరకు ఒక్క సెల్ ఫోన్‌పైనే ఆదాయం వస్తోంది. అలాగే ఇతర వస్తువుల మీద కూడా అధికంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రోజుకు సుమారు రూ.లక్ష వరకు దోపిడీ చేస్తున్నట్టు తెలుస్తోంది.

**నిర్దేశిత ధరలు**

| వస్తువు | నిర్ణయించిన ధర రూ |
|---|---|
| సెల్‌ఫోన్లు | 5 |
| కెమెరా | 10 |
| బ్యాగు | 5 |
| పాదరక్షలు | 2 |

**నిబంధనలు ఇలా..**

ప్రతి కౌంటర్ వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలి. ఒక వేళ ఎవరైనా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తే ఫిర్యాదు చేసేందుకు సంబంధిత సెల్ నంబర్ ఉండాలి. కానీ ఇక్కడ అలాంటివేవీ ఏర్పాటు చేయలేదు.

**గతంలో విమర్శలు**

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు ఆలయంలో దోపిడీ జరిగిపోతోందంటూ నానాయాగి చేశారు. ఇపుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముక్కంటి భక్తులను ముక్కుపిండి వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

**చర్యలు తీసుకుంటాం**

టెండర్లలో పొందుపరిచిన దానికంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై భక్తులతో మాట్లాడి, విచారించి చర్యలు తీసుకుంటాం. టెండరు ప్రక్రియ ద్వారానే వారు దక్కించుకున్నారు. నిబంధనలు పాటించాల్సిందే. గత కాంట్రాక్టరు టెండరు పూర్తి మొత్తం చెల్లించాడా లేదా అనే విషయంపై విచారిస్తాం.

– బాపిరెడ్డి, ఈవో, శ్రీకాళహస్తీశ్వరాలయం

### జూపార్క్‌కు సెలవు లేదు

**తిరుపతి మంగళం :** సంక్రాంతి పర్వదినాల్లో జూ సందర్శన ఉంటుందని, ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నామని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)కు ప్రతి మంగళవారం సెలవు ఉంటుందన్నారు. అయితే సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ మంగళవారం సెలవు ఉండదని, సందర్శకులను అనుమతిస్తున్నామని వెల్లడించారు. అయితే గురువారం మాత్రం జూకు సెలవు ఉంటుందని వివరించారు.

### పోలీసులను అడ్డుకున్న వారిపై కేసు నమోదు

**వరదయ్యపాళెం:** విధుల్లో ఉన్న పోలీసులపై తిరగబడడం, అనుచితంగా మాట్లాడిన యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వరదయ్యపాళెం దళితవాడకు చెందిన మల్లికార్జున్, అశోక్ జీవీఆర్ బేకరి సిబ్బందితో గొడవకు దిగడంతోపాటు దాడికి యత్నించారని తెలిపారు. బేకరి యజమాని దిలీప్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై కానిస్టేబుల్ సుబ్రమణ్యం శనివారం రాత్రి బేకరి వద్ద విచారణకు వెళ్లాడన్నారు. ఆ సమయంలో నిందితులు మల్లికార్జున్, అశోక్ కానిస్టేబుల్‌పై అనుచితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనిపై కానిస్టేబుల్ సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకులపై మరో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**వ్యక్తిపై లైంగిక వేధింపుల కేసు**

ఓ యువతిని మాయమాటలు చెప్పి లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మండలంలోని బత్తలవల్లం దళితవాడకు చెందిన రాజేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో తన స్నేహితుడు రమేష్ నిన్ను ఇష్టపడుతున్నాడని, అతని కోరిక తీరిస్తే ఆర్థికంగా సాయం చేయిస్తానని వేధించేవాడు. దీనికి యువతి నిరాకరించడంతో నాలుగు రోజులుగా సంబంధిత యువకులు వేధింపులకు పాల్పడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇస్రో చైర్మన్‌గా నారాయణన్



**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన చైర్మన్‌గా డాక్టర్ వి.నారాయణన్ నియమితులయ్యారు. తమిళనాడు మహేంద్రగిరి వలయమల వద్ద ఉన్న లిక్విడ్ ప్రపొల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై చైర్మన్ ఈ నెల14 బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత చైర్మన్ ఎస్.సోమనాథ్ సోమవారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. 2022 జనవరి 15వ తేదీన ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమనాథ్ ఎన్నో ప్రతిష్టాత్మక ప్రయోగాలకు నేతృత్వం వహించారు. మూడేళ్ల కాలంలో 24 ప్రయోగాలు విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు.

**అంచెలంచెలుగా ఎదిగిన నారాయణన్**

తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని మేలకట్టు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో నారాయణన్ జన్మించారు. ప్రాథమిక విద్య అంతా స్వగ్రామంలోనే పూర్తి చేశారు. పదోతరగతి అనంతరం డిప్లొమో ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ సాధించారు. ఏఎంఐఈ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో అసోసియేట్ మెంబర్‌షిప్ సాధించారు. తర్వాత ఖరగ్‌పూర్ ఐఐటీలో క్రయోజనిక్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. ఎంటెక్‌లో కూడా ర్యాంక్ సాధించి సిల్వర్ మెడల్ పొందారు. అనంతరం ఆయన ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. 1984లో ఇస్రోలో ఇంజినీర్‌గా చేరిన ఆయన అనేక స్థాయిల్లో పని చేశారు. జీఎస్ఎల్‌వీ క్రయోజనిక్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. చంద్రయాన్-2, చంద్రయాన్-3 ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరించారు. జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్‌లో వినియోగించే ఎల్-110, సీ-25 దశలను రూపొందించడంలో ఆయనదే కీలకపాత్ర. సాధారణ ఇంజినీర్‌గా చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఇస్రో అధిపతి స్థాయికి చేరుకున్నారు.

## ముఖ్యమంత్రికి సాదర స్వాగతం


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి సత్యప్రసాద్

**శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట):** జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, డీఐజీ షిమోషీ బాజ్‌పేయి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, భాను ప్రకాష్, థామస్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోలా ఆనంద్, బాలసుబ్రమణ్యం, హరి ప్రసాద్, నరసింహయాదవ్, సీఆర్ రాజన్ తదితరులు స్వాగతం పలికారు.

**నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు**


**తిరుపతి రూరల్ :** సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెకు ఆదివారం రాత్రి చేరుకున్నారు. ఆయనకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటికే సీఎం సతీమణి భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి, వారి కుమారుడు దేవాన్ష్‌తో పలువురు నందమూరి కుటుంబ సభ్యులు సైతం చేరుకున్నారు. మంత్రి లోకేష్ కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయమే వచ్చారు. ఈ నెల 15వ తేదీ వరకు ముఖ్యమంత్రి కుటుంబంతో పాటు నారావారిపల్లెలోనే ఉండనున్నారు.

## ఏటి పండుగకు సర్వం సిద్ధం


గత ఏడాది ఏటి పండుగకు హాజరైన జనం

**నాయుడుపేటటౌన్ :** పట్టణంలో భోగి, సంక్రాంతి పండుగల తర్వాత కనుమ నుంచి మూడు రోజులపాటు ఏటి పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ పండుగలో భాగస్వాములు కావడం ప్రత్యేకత. స్వర్ణముఖి నదీ తీరంలో అత్యంత వైభవంగా నిర్వహించే ఏటి పండుగకు ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా హాజరవుతుంటారు. ఆత్మీయత పంచుకుంటూ ఆహ్లాదకర వాతావరణంలో సహపంక్తి భోజనాలు చేస్తుంటారు. గాలిపటాలు ఏగురవేస్తూ ఉత్సాహంగా గడుపుతుంటారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తుంటారు. ముఖ్యంగా మహిళలు ఇంటి వద్దనే గౌరీదేవి, గొబ్బెమ్మ ప్రతిమలను తయారు చేసుకుని నదీ తీరంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అనంతరం పవిత్ర స్వర్ణముఖిలో నిమజ్జనం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చే ఏటి పండుగకు నదీతీరంలో పలువురు వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది సైతం ఏటి పండుగను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఏర్పాట్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, కమిషనర్ షేక్ ఫజులుల్లా పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన ఏటి పండుగకు శ్రీకారం చుట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

## ముగిసిన కపిలేశ్వరస్వామి తెప్పోత్సవాలు


తెప్పపై విహరిస్తున్న చంద్రశేఖరస్వామి

**తిరుపతి కల్చరల్:** కపిలేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తెప్పోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఆదివారం రాత్రి చంద్రశేఖరస్వామి తెప్పను అధిరోహించి పుష్కరిణిలో తొమ్మిది చుట్లు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు ఆలరించాయి. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో 'సంక్రాంతి క్రికెట్'

– టోర్నమెంట్‌ను ప్రారంభించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి
– హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లు


క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి

**తిరుపతి రూరల్ :** తుమ్మలగుంట కేవీఎస్ మైదానంలో సంక్రాంతి క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే క్రికెట్ పోటీలను చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు అత్యంత సౌకర్యవంతంగా పిచ్‌పై జరిగే ఈ పోటీలను కేవీఎస్ క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. తుమ్మలగుంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లందుల సుధాకర్ రెడ్డి ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభను చూపించారు. క్రికెట్ క్రీడపై ఉన్న అభిమానంతో 100 మందికి పైగా క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోరాడుతూ మ్యాచ్‌లను హోరాహోరీగా మారుస్తున్నారు. ఇక్కడ పదేళ్లుగా సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు జరిపిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన యువకులందరూ సంక్రాంతి పర్వదినాన స్వగ్రామాలకు వచ్చి ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఆటలు ఆడేందుకు వీలుగా ఈ టోర్నమెంట్ ఉపయోగపడుతోందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అలసత్వం వహిస్తే చర్యలు

- బస్సుల కండిషన్ చూసుకోవాలి
- డీపీటీఓ నరసింహులు


శ్రీకాళహస్తి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీపీటీఓ నరసింహులు

**తిరుపతి అర్బన్ :** డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి, శ్రీకాళహస్తి బస్టాండ్‌లను ఆయన పరిశీలించారు. డీపీటీఓ మాట్లాడుతూ డ్రైవర్లు బయలుదేరే ముందు బస్సు కండిషన్‌ను తప్పనిసరిగా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్యారేజ్‌లో మెకానిక్‌లు కూడా ప్రతి సర్వీస్‌ను నిశితంగా తనిఖీ చేయాలని సూచించారు. అవసరం అయితే కొత్త విడి భాగాలను అమర్చాలన్నారు. దీనిపై ఆయా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల తుల్లివెలుగు బస్సు ప్రమాదానికి కారణమైన శ్రీకాళహస్తి డిపోలో అన్‌కాల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కేజీ స్వామిని విధుల నుంచి తొలగించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రశాంత్ మృతదేహం

**సైదాపురం :** మండలంలోని చాగణం- ఊటుకూరు రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. చాగణం ఎస్టీ కాలనీకి చెందిన రాపూరు శ్రీనయ్య కుమారుడు ప్రశాంత్(23)కు ఏడాది క్రితం వేగమ్మ అనే మహిళతో వివాహమైంది. ప్రశాంత్ రోజూ మైన్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. ఈక్రమంలో బైక్‌పై ఊటుకూరుకు వెళ్లి తిరుగుప్రయాణంలో ఉండగా జోగిపల్లె వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పంటకాలువలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబీకులు ఘటనాస్థలానికి వెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### కారు ఢీకొని మహిళకు గాయాలు

**చిల్లకూరు :** నెల్లూరు- చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం చిల్లకూరు వద్ద కారు ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. ముత్యాలపాడుకు చెందిన వినీషా అనే మహిళ స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి చిత్తూరు వెళుతున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితురాలు అపస్మారకస్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆలయంలో హుండీల చోరీ

**తిరుమల :** తిరుమల బాలాజీ నగర్‌లోని వినాయకుని ఆలయంలో రెండు హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.. వివరాలు.. ఆదివారం ఉదయం ఆలయం తెరిచి చూడగా హుండీలు చోరీకి గురైనట్లు కమిటీ సభ్యులు గుర్తించారు. దుండగులు శనివారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను సమీపంలోని కమ్యూనిటీ భవనంలోకి తీసుకెళ్లి అందులోని కానుకలను దోచుకెళ్లారు. తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం!

ఆరోగ్య కేంద్రంలో అనారోగ్యకర పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ఎటు చూసినా చెత్తాచెదారాలే కనిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి దుస్థితిపై స్థానికులు మండిపడుతున్నారు. తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

- అధ్వాన్నంగా చిన్న పాండూరు పీహెచ్‌సీ
- పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- తీవ్రంగా ఇబ్బందిపడుతున్న రోగులు


గత ప్రభుత్వంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


ఓపీ వద్ద పడివున్న చెత్తకుప్పలు


ల్యాబ్ వద్ద నిండిన చెత్తకుండీలు

**వరదయ్యపాళెం :** మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. ఇదివరకు విధులు నిర్వర్తించిన ఇద్దరు అటెండర్లకు వయసు మీరడంతో తొలగించారు. వారి స్థానంలో నూతనంగా ఎవరినీ నియమించలేదు. దీంతో గత కొద్దిరోజులుగా హాస్పిటల్‌లో రోజువారీ చెత్త ఊడ్చే దిక్కు లేని పరిస్థితి. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. ఓపీ కేంద్రం, వైద్యాధికారుల గది, ల్యాబ్‌లో సైతం చెత్త పేరుకుపపోయింది. ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాక జిల్లా అధికారుల సైతం ఏమాత్రం స్పందించడం లేదని ఆస్పత్రి సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. 24 గంటల స్థాయి కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజువారీ 250 మందికి పైగా రోగులు వస్తుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఆస్పత్రిలో పారిశుద్ధ్య సమస్యలపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**గత ప్రభుత్వంలో రూ. 2కోట్లతో భవన నిర్మాణం**

చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 2కోట్లు వెచ్చించి అధునాతన వసతులతో నూతన భవనం నిర్మించారు. అందులో వైద్యసేవలు ప్రారంభించి ఏడాది పూర్తయింది. అయితే కూటమి ప్రభుత్వంలో కనీసం చెత్త ఊడ్చే దిక్కు కూడా లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే వైద్య సిబ్బంది సైతం చెత్త కుప్పల నడుమ విధులు నిర్వహించాల్సిన దుస్థితి తలెత్తింది. ఆస్పత్రి పారిశుద్ధ్య అవసరాల కోసం ఇద్దరు అటెండర్లను నియమించాలని, లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.